క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. అందులో భాగంగా గ్రంథాలయాధికారి శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్ పోటీలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు శిబిరం ముగింపు రోజు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్కాపురం: నైట్రోజన్ పైప్ తగిలిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన వై.సుశీల్‌యాదవ్(35) పరవాడలోని ప్రోక్షన్ ప్రొడక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి నైట్రోజన్ తరలించే లారీలో పని చేస్తున్నాడు. దీనిలో భాగంగా సోమవారం సంస్థ వద్ద లోడ్ చేసిన నైట్రోజన్ లారీతో హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)కు వచ్చాడు. లారీలోని నైట్రోజన్‌ను అన్‌లోడ్ చేసేందుకు అవసరమైన పైప్‌ను హెచ్‌పీసీఎల్‌లో ఉన్న నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్ పైపునకు బిగించాడు. నైట్రోజన్ అన్‌లోడ్ అవుతుండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో పైపు వేగంగా వచ్చి సుశీల్‌ను బలంగా ఢీకొంది. గాయపడిన ఆయనను అంబులెన్స్‌లో నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జేసీఎస్ కన్వీనర్ ముత్యాలనాయుడు తదితరులు

సబ్బవరం: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మండలంలో గురువారం చురుగ్గా సాగింది. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొని, వలంటీర్, సెక్రటరీలతో కలసి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. వంగలి సచివాలయం పరిధిలోని వంగలి, టిక్కలిపాలెం, సబ్బవరం సచివాలయం పరిధిలోని ఆదిరెడ్డిపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, బైలపూడి దేముడుబాబు, గవర రాజు, యర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలు

మర్రిపాలెం: వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఈ మేరకు ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. యలమంచిలి ప్రాంతానికి చెందిన కసింకోట భవాని, తన కుమారుడు శశిభూషణ్‌తో కలిసి బుధవారం(గత నెల 31న) కంచరపాలెం కప్పరాడలోని తన బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం కప్పరాడ జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవాని, శశిభూషణ్‌తో కలిసి రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఏసర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శశిభూషణ్‌కు గాయాలయ్యాయి. తల్లి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్ కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేపట్టారు.

జీర్ణకోశ సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచించనున్నారు. తీవ్ర అనారోగ్య కలిగిన వారు తమ వైద్య పరీక్షలు రిపోర్టులను తీసుకురావాలని సూచించారు.

13న పైడితల్లి అమ్మవారి పండగ

- 12న తొలేళ్ల ఉత్సవం
- గ్రామస్తులు, గ్రామపెద్దల సమక్షంలో ప్రకటన



పండగ నిర్వహణ తేదీల పత్రాన్ని ఏఈవోకు అందిస్తున్న వెంకటరమణ



పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి వార్షిక పండగ మహోత్సవాన్ని ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, పూజారి వంశీయుడు లండ వెంకటరమణ ప్రకటించారు. అమ్మవారి పండగ నిర్వహణపై దేవస్థానానికి చెందిన నృసింహ సదన్‌లో అడవివరం గ్రామపెద్దలు, పూజారి వంశీయులు, గ్రామస్తులతో దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. అమ్మవారి పండగ తేదీ, ఏర్పాట్లపై చర్చించారు. ఈ మేరకు అమ్మవారి పండగను ఈ నెల 13న నిర్వహించాలని పూజారి వంశీయులు సభాముఖంగా తెలియజేయడంతో ఏఈవో ఆ తేదీని ఖరారు చేశారు. సంబంధిత ఏర్పాట్లపై లండ వెంకట రమణ ఏఈవోకు వినతి పత్రం అందజేశారు.

4న చాటింపుతో శ్రీకారం

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4న పండగ చాటింపు, ఉజ్జిపోలమ్మ అనుపు ఉంటాయని వెంకటరమణ తెలిపారు. 5న పైడితల్లి, ముత్యాలమ్మ దేవతల దేవర తెచ్చే కార్యక్రమం, 6న ముత్యాలమ్మ అనుపు మహోత్సవం, 12న పైడితల్లి తొలేళ్ల పండగ, 13న పైడితల్లి పండగ మహోత్సవం జరిపించనున్నట్లు తెలియజేశారు. 20న మారువారం పండగ ఉంటుందన్నారు. పండగను పురస్కరించుకుని గ్రామంలో భారీ ఎత్తున లైటింగ్, తొలేళ్ల రోజు సాంస్కృతిక కార్యక్రమం, అనుపు మహోత్సవం రోజు కార్యక్రమాల ఏర్పాటు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఈవోను కోరారు. సమావేశంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, అడవివరం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి స్వామి, అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరాహ నరసింహం, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



97వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చెందుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 97వ వార్డు 497 సచివాలయం పరిధిలోని కార్మికనగర్, గిరిప్రసాద్ నగర్, సప్తగిరి నగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి ఎవరైనా సంక్షేమ ఫలాలకు నోచుకోకుంటే, వారికి పథకాలు వర్తించేలా చేయాలని సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమావేశం

జగనన్న హౌసింగ్ కాలనీ ఇళ్ల నిర్మాణ పనులపై ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. పటిష్టంగా, నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఎలాంటి అశ్రద్ధ వహించొద్దన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఈఈ రాజు, డీఈ ప్రసాద్, ఏఈ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ సత్యనారాయణ
- సోమునాయుడు చెరువు ఆక్రమణపై విచారణ



చెరువు ఆక్రమణపై విచారణ చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: సాగునీటి చెరువులు ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బి. సత్యనారాయణ హెచ్చరించారు. బంగారమ్మపాలెం గ్రామంలోని సోమునాయుడు చెరువు ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులు, పోలీసుల కేసుల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సీఐ రంగనాథం సమక్షంలో తహసీల్దార్ సత్యనారాయణ గురువారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భూ స్థితి చెరువుగా ఉంటే ఆ స్థితిని చట్టప్రకారం ధ్వంసం చేయరాదని వెల్లడించారు. వెంకునాయుడు చెరువు సుమారు 100 ఏళ్లుగా సర్వే నంబర్లు 49, 50, 52లలో సుమారు 30 ఏకరాల్లో విస్తరించి ఉందన్నారు. గతంలో ఈ చెరువులో ఉపాధి పథకంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అటువంటి చెరువులో తమ జిరాయితీ భూమి ఉందని ఆక్రమించడం, గట్టును.. నీరు ప్రవహించే గెడ్డ స్థితిని ధ్వంసం చేయడం సాగునీటి చట్టాల ప్రకారం నేరమని స్పష్టం చేశారు. ఒకవేళ జిరాయితీ అయినప్పటికీ భూ స్థితి చెరువు, గెడ్డ, వాగుగా ఉంటే అటువంటి వాటిని ఎవరూ ఆక్రమించకూడదని, భూ స్థితిని మార్చకూడదని తెలిపారు. అప్పటి అవసరాలు, కట్టుబాట్లను బట్టి పూర్వీకులు చెరువుగా నిర్ధారించి హద్దులు నిర్ణయించారనీ, వాటిని ఇప్పటి తరం వారు ధ్వంసం చేయరాదని తెలియజేశారు. సోమునాయుడు చెరువును ఆక్రమించినా, చెరువు గట్టును ధ్వంసం చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ, ఆయకట్టు రైతులు, గ్రామ పెద్దలు దొడ్డి ప్రకాష్, కోరిబిల్లి నూకరాజు, పలువురు రైతులు, ఆక్రమణదారులు పాల్గొన్నారు.

సింహగిరిపై శాస్త్రోక్తంగా నృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నృసింహ హోమాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న యజ్ఞశాలలో హోమం జరిపించారు. చక్రపెరుమాళ్లను ఆలయంలో నుంచి తిరువీధిగా తీసుకెళ్లి కల్యాణమండపంలో వేంజేపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులందరి చేత అష్టోత్తర శతనామావళి పఠింపజేశారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరవాడ: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పరవాడ ఈపీడీసీఎల్ సెక్షన్ ఏఈ శేష సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, సునపర్తి పరవాడ, భర్నికం, తానాం, ఈ.బోనంగి, పి.బోనంగి, కలపాక, రావాడ, దేశపాత్రునిపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబను దర్శించుకొన్న గ్రామ పెద్దలు

పరవాడ: పరవాడ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు పైల అప్పారావు, చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, ఆలయ ధర్మకర్త పైల పోతినాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి డప్పులు, డ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలతో అమ్మవారిని ఊరేగించారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పాము కాటుకు మహిళ మృతి



రాజాన పరదేశమ్మ(ఫైల్)

సబ్బవరం: నారపాడు గ్రామానికి చెందిన రాజాన పరదేశమ్మ(55) పాము కాటుకు గురై మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పరదేశమ్మ గురువారంఉదయం పశువుల మేత కోసం పొలానికి వెళ్లింది. అక్కడ పాము కాటుకు గురికావడంతో తొలుత అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. కేజీహెచ్‌కు తరలిస్తుండగా ఆమె పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలో ఉన్న అగనంపూడిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని గ్రామ సర్పంచ్ మామిడి శంకరరావు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికుల సంక్షేమానికి నష్టం వాటిల్లుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కోవాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 840వ రోజు, గురువారం సంస్థకు చెందిన ఎస్‌ఎంఎస్–1 విభాగం కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇళయరాజా గీతాలపై సినీ సంగీత విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 80వ జన్మదినోత్సవం, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 3న కళాభారతి ఆడిటోరియంలో మాస్ట్రో ఇళయరాజా స్వర పరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రతాప్‌కుమార్ తెలిపారు. సంగీత విభావరి పోస్టర్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరింపజేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ప్రపంచ పర్యావరణ దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 3న సాయంత్రం 6 గంటలకు కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో సినీ నేపథ్య గాయకులు నిత్య సంతోషిని, నెల్లూరు రాము, నాదప్రియ, ఐఏఎస్ అధికారి డాక్టర్ జి. లక్ష్మీశా, హజ్రత్, యాక్మీ ఆనంద్ కుమార్, డి. భూపతిరావు ఇళయరాజా స్వర పరచిన గీతాలు ఆలపించనున్నారని ప్రతాప్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, యాక్మీ ప్రతినిధులు పి. పర్వేష్, కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శ్వాసకోశ వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, వీ సెజ్ అధికారులు

అగనంపూడి: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఊపిరితిత్తులు, శ్వాస సంబంధిత వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. దువ్వాడ వీ సెజ్, మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా, వీ సెజ్ పరిపాలనా విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు సూచించిన సలహాలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో జేడీసీ రోహిణి అపరంజి, ఏడీసీ శ్రీనివాసరావు, ఆస్పత్రి పల్మనాలజిస్ట్ సత్యపద్మజ, కులదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి కృషి



మర్రిపాలెం రైతుబజార్‌లో సమస్యలు పరిశీలిస్తున్న సీఈవో నందకిషోర్

గోపాలపట్నం: నగరంలోని అన్ని రైతుబజార్ల అభివృద్ధికి క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్నామని రాష్ట్ర రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈవో) ముల్లంగి నందకిషోర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మర్రిపాలెం రైతుబజార్‌లో ఆయన పర్యటించి రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో రైతుబజార్ల ఈవో తెలిపిన సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ వైరింగ్, లైట్లు, రైతుబజార్ల వెనుక వైపు కాంపౌండ్ వాల్, బజారు ముఖద్వారం, మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, ఫ్లోరింగ్ మరమ్మతులు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతుబజార్‌లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు, వినియోగదారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య అధికారి షేక్ యాసిన్, డీఈ కెనడీ, మర్రిపాలెం రైతుబజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా చదరంగం పోటీలు

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో నిర్వహిస్తున్న చదరంగం శిక్షణలో భాగంగా గురువారం విభాగాల వారీగా విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశారు. కోచ్ ఉమాపతి పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో బాల, బాలికలు ఎంతో నైపుణ్యం ప్రదర్శించారు. ఈ పోటీలు రౌండ్ల వారీగా నిర్వహిస్తున్నందున శుక్రవారం కూడా శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు కొనసాగనున్నాయి విజేతలకు జ్ఞాపికలు, శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు శనివారం సాయంత్రం 6 గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. అనంతరం రాత్రికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులు, విద్యార్థులు తప్పక హాజరు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. శిబిరం ఏర్పాట్లను కార్యవర్గ సభ్యులు, క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.


నర్సింహనగర్‌లో జెడ్సీ పర్యటన



బంక్ జంక్షన్‌లో టీ దుకాణం వద్ద పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ సమీపంలోని నరసింహనగర్‌లో గురువారం ఉదయం జోనల్ కమిషనర్ మల్లయ నాయుడు పర్యటించారు. పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు వీధుల్లో రహదారులపై వ్యర్థాలు వేసిన వారికి జరిమానా విధించాలని సచివాలయ కార్యదర్శులకు జెడ్సీ ఆదేశించారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడిన వారిపై కఠిన చర్యలు ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని కోరారు. ప్లాస్టిక్ సంచులు అమ్మినా.. కొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో శానటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.